


సరళ యెక్కింది, రైలు కదిలింది. దారిలోనే పడేశాడు కూలీవాడు సామాను. పెట్టె, బెడ్డింగ్ కంపార్టుమెంటు లోపలిదాకా యీడ్చుకు వచ్చింది సరళ. ఎంతో ప్రయత్నంతో పెట్టె యెత్తి పైన పెట్టింది. హోల్డాలు విప్పి, లోపల్నుంచి ఒక దిండు లాగి పైన పడేసి, చెప్పులు కింద విడిచింది. తాపీగా దిండు సానుకుని కూర్చుని ఎదురుగా చూసింది.

కంపార్టుమెంటు చాలా చిన్నది. తనతోటి ప్రయాణీకు లెవరోనని ఎదురుగా కూర్చున్నవాళ్ళ వంక పరీక్షగా చూసింది సరళ. ఇద్దరు ఆడవాళ్ళూ తనూ మాత్రమే వున్నారు ఆ కంపార్టుమెంటులో. ఒకావిడకి యాభై ఏళ్ళు పైబడ్డాయి. రెండో ఆవిడకి ముప్ఫైఐదు ఏళ్లు వుంటాయి. వాళ్ళిద్దరూ అప్పాచెల్లెళ్ళన్నా కావచ్చు, అత్తాకోడళ్ళన్నా కావచ్చు. చిన్నావిడముఖం అందంగానే వుంది. ఆవిడ వంటి నిండా నగలున్నాయి. ఖద్దరు సిల్కుచీరె కట్టుకుంది. రెండోఆవిడకి యింకా ఎక్కువగానే వున్నాయి నగలు. ఆవిడో గుంటూరి నేత జరీచీర కట్టుకుంది. ఇద్దరూ కిటికీలోంచి బైటికి చూస్తున్నారు. సరళ చాలాసేపు వాళ్ళిద్దరివంకా చూసింది. కాని వాళ్ళల్లో ఒక్కళ్ళుకూడా తల తిప్పి ఆమె వంక చూడలేదు. ఈ సంగతి సరళను కొద్దిగా నిరుత్సాహపరచిన మాట వాస్తవమే.

సరే, తలకాయ తిప్పేసి తనుకూడా బైటికే చూడసాగింది సరళ. రైలు చాలా స్పీడుగా పోతోంది. రైలు కుదుపుకి మెల్లిగా లయతో వూగుతోంది సరళ శరీరం. సూర్యాస్తమయ సమయం, బయళ్ళు, దూరానున్న నీలినీలి మబ్బులు అన్నీ సువర్ణకాంతిమయంగా గోచరిస్తున్నాయి. అక్కడక్కడా చెట్లు, పొదలు వెనక్కి పరుగెత్తుకు పోతున్నాయి. కాని వాటివంక చూస్తూ ఏదో వూహాప్రపంచంలో మునిగిపోయేంత భావుకురాలు కాదు సరళ.

ఏంతోచక మళ్ళీ ఎదురుగా వున్న యిద్దరి వంకా చూసింది. వాళ్ళల్లో పెద్దావిడ సరళవంక ఒక్కక్షణం చూసి తల తిప్పేసుకుంది. సరళ తన వాచీ చూసుకుని, అనవసరంగా చేతినుంచి తీసి 'కీ' యిచ్చింది. ఈ మోతకి రెండో ఆవిడ తలతిప్పి సరళవంక, ఆమె వాచీవంక చూస్తూ కూచుంది చాలాసేపు.

సరళకి యీ చూపు కాస్త యిబ్బందిగానే వున్నా ఆనందంగానే వుంది. షిఫాను చీరె పమిట జారిపోతుంటే తీసి, నిండుగా కప్పుకుంది. ఆవిడ

వంక చూడటం లేదు కానీ, ఆవిడకళ్లు తన మీదే వున్నట్టు తెలుసు సరళకి. పమిట కొంగుమీద వున్న అందమైన ఎఱ్ఱజిబ్జైను వంక చూసుకుంది ఓ మాటు. అప్రయత్నంగా ఎఱ్ఱరాళ్ల ఉంగరాన్ని కుడిచేతి నుంచి ఎడమ చేతికి మార్చింది.

ప్రయాణాలలో—అందులోనూ యింత చిన్న కంపార్టుమెంటులో—యిద్దరుముగ్గురే వుంటే సంభాషణ సాగితీరాలి. ఎవరో ఒకళ్ళు ముందు పలుకరించాలి. సాధారణంగా పెద్దవాళ్ళు పలుకరిస్తారు చిన్న పిల్లలను పనినిముషాలు నిశ్శబ్దంగా సాగటమే అసంభవంగా, దుర్భరంగా వుంది సరళకి. అందులోనూ ఎదటివాళ్లు తనవంకన్నా చూడటంలేదు. మహా యిబ్బంది పడిపోతున్నట్లుగా మొహం ముడుచుకుని, మెడవంచి ఓమాటు రాళ్ళనెక్లెసు సవరించుకుంది. ఒక పెద్ద నిట్టూర్పు విడిచింది.

సరళకి పదహారేళ్లు. ఇంటరు రెండో సంవత్సరం చదువుతోంది. అది వాళ్ళవూళ్ళో, కాలేజీలో, స్నేహితులతో చాలా అబ్బురమైన విషయం. బంధువుల్లో అంతా ముక్కుమీద వేలేసుకునేవాళ్లే. "అప్పుడే ఎఫ్. ఏ. నా!" అని. అదో గర్వం సరళకి. ఎన్నిమాట్లో ప్రయాణాల్లో ఎవరో ఒకరు "ఏం చదువుతున్నావమ్మాయి" అని అడగడం, తను ఇంటరనగానే ఎంతో ఆశ్చర్యపడిపోవడం సరళ ఎరుగుంది.

కాని-ఈ ప్రయాణం ఏదో విరుద్ధంగా వుంది. మెల్లిగా మోచేతి మీదలేచి బెడ్డింగు లోంచి 'అగథా క్రిస్టీ' నవల ఒకటి తీసింది ఆమధ్య నాన్నగారు కొనిచ్చారది. మొదలెట్టి, అర్థంకాక విసుగుపుట్టి మానేసింది. కాని యిప్పుడు తీయాల్సి వచ్చింది.

ముఖానికడ్డంగా పుస్తకం పెట్టుకుని, దీక్షగా చదవసాగింది సరళ. ఆ ఆడవాళ్ళిద్దరూ తనవంక చూస్తున్న సంగతి ఆమె వెంటనే పసికట్టేసింది. మరింత దీక్షగా, వూపిరి బిగబట్టేసి గబగబ చదవసాగింది "వీళ్లు అడుగుతారింక. తప్పదు. 'ఏవూరు వెడుతున్నావు'తో మొదలెట్టి, చదువు, తల్లిదండ్రులు, పెళ్ళివివరం అన్నీ అడుగుతారు." చిన్న చిరునవ్వు వచ్చింది సరళ ముఖాన. పేజీ తిరగేసింది.

ఇంతకీ-కిందటి పేజీలో ఒక్క ముక్క అర్థం కాలేదన్న సంగతి జ్ఞాపకం వచ్చింది సరళకి. పుస్తకం పేరేమిటి! అనుకుని అట్టవేపు చూసింది. 'మర్డర్ ఇన్ మెసపొటోమియా' అని చదివింది. ఇదేమిటని మళ్ళీ ఓమాటు చూసింది. 'మా! మెసపొటోమియా!' అని కూడబలుక్కొని చదివింది.

హఠాత్తుగా మాట్లాడ్డం మొదలెట్టారు సరళ ఎదురుగా కూర్చున్నవాళ్లు.

"మీ గేదె యీనిందా?" అన్నది చిన్నావిడ.

"లేదు వదినా, పెరుగుకి చాలా ఇబ్బంది పడిపోతున్నాము."సరే, పల్లెటూరి సజ్జు అనుకుంది సరళ. మళ్ళీ వాళ్లవంక చూస్తూ కూచుంది ఆమె.

ఒక్కనిముష మైనాక పెద్దావిడ పలుకరించింది, "మరి వదినా! సత్యానికి గుంటూరులో పని దొరకిందటగా."

"ఔను. వాడి తల్లి అదృష్టమంతాను. పాపం, అష్టకష్టాలు పడి కడుపులో పెట్టుకుని పెంచిందావిడ. ఫలం దక్కింది. ఆవిడ సుఖపడుతుంది లే ఇంక" అంది చిన్నావిడ నిర్లిప్తంగా సరళ పుస్తకం మీది బొమ్మవంక చూస్తూ.

"ఏం ఉద్యోగమో! గుంటూరులో, యెండకాలంలో ఉంటే ప్రాణం కడగట్టిపోతుంది బాబూ" అంది పెద్దావిడ.

సరళ ఓపిక సన్నగిల్లుతోంది. వీళ్ళు తోటివాళ్ళతో మాట్లాడరేమిటి? సరళ అహం దెబ్బతింటున్నట్లుగా వుంది. గిలగిలలాడిపోయింది సరళ—తను యింటరు చదువుతున్నాననీ, సంగీతం బాగా వచ్చుననీ, తనకి ఎస్. ఎస్. ఎల్. సి. లో స్కూలు మొత్తంమీద ఫస్టు మార్కనీ—చెప్పాలనుందామెకి.

ఇంగ్లీషు పుస్తకం చదువుతోంది. రిస్టువాచి పెట్టుకుంది. బూట్లు తొడుక్కుంది. ఖరీదైన చీరె, నగలు వున్నాయి. ఏదో ఒకటి అడగరేం? వాళ్ళల్లో వాళ్ళు గొణుక్కోకపోతే ఓ ప్రశ్న వేయరాదూ? బొత్తిగా ఆసక్తి లేదేం వీళ్ళకి. సరళకి అనవసరంగా కోపం వచ్చింది వాళ్ళమీద. స్నేహాలు కలిపేసుకుని, టిఫెన్లు, కాఫీలు ఒకళ్ళకొకళ్ళు యిచ్చేసుకుని, అమాంతం ప్రాణం యిచ్చేటంతగా దగ్గరై పోతారు కొందరు ప్రయాణాల్లో. గంటన్నర గడచినా, నాలుగు స్టేషన్లు దాటినా

(తరువాయి 37-వ పేజీలో)